నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్, బుధవారం 31 జనవరి 2024 | VIKARABAD

పోకిరీ మొగుళ్లను పొట్టుపొట్టు కొట్టిండ్రు

షీటీమ్స్ వినూత్న ఆలోచన

నుమాయిష్‌లో వెకిలిచేష్టలు చేసిన వారికి 'ఫ్యామిలీ కౌన్సెలింగ్'

వీడియో ఫుటేజ్‌లు చూపించగానే... భర్తల భరతం పడుతున్న భార్యలు

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : బయట షరీఫ్ శంకరయ్యలుగా బిల్డప్ ఇస్తూ.. తమను ఎవ్వరూ చూడడం లేదని రద్దీ ప్రాంతాల్లో మహిళలతో వెకిలిగా ప్రవర్తిస్తున్న వారిపై షీటీమ్స్ ప్రత్యేక నిఘా పెట్టారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో ఇటువంటి పోకిరీలపై నజర్ వేసి వారి చేష్టలను వీడియో తీస్తున్నారు. సదరు పొకిరీలను పట్టుకొని తమ కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్‌కు రావాలని సూచిస్తున్నారు. దీంతో మరుసటి రోజు భార్యతో కలిసి రాగా.. వారి చేష్టలను వీడియోలో చూసిన భార్య అతడి భరతం పడుతున్నది. ఇలా షీ టీమ్స్‌కు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడుతున్న వారి చేష్టలను చూసి చాలా మంది కుటుంబ సభ్యులు నిశ్చేష్టుల వుతున్నారు. ఇంట్లో తల్లిదండ్రులకు, పెద్దవాళ్లైతే భార్యలకు తమ నిజ స్వరూపం తెలిసిపోతుండడంతో చేసేది లేక మన్నించాలంటూ వేడుకుంటున్న ఘటనలు జరుగుతున్నాయి. వారు చేసిన తప్పులను బట్టి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నారు. పెండ్లైన వారైతే వారి భార్యలను కౌన్సెలింగ్‌కు పిలిపిస్తున్నారు. తన భర్త మంచివాడని, ఎలాంటి తప్పు చేయడంటూ షీ టీమ్స్ ముందు వాదిస్తుంటారు. అయితే కౌన్సెలింగ్ చేసే వారు ఒక్కసారి ఈ వీడియో చూడండంటూ వారి భార్యలకు చూపిస్తున్నారు. దీంతో భార్య శివంగిలా మారి, భర్త చెంపలు చెళ్లుమనిస్తున్నది. పెండ్లి కాని యువత, మైనర్ పిల్లల విషయంలోనూ తల్లిదండ్రులను పిలిచి వీడియోలు చూపిస్తున్నారు.

చాలా మంది మారుతున్నారు..

– నగర మహిళా భద్రత డీసీపీ, కవిత

షీ టీమ్స్‌కు పట్టుబడుతున్న వారు కౌన్సెలింగ్‌తో మారుతున్నారు. అయితే పట్టుబడుతున్న వారు ఇంట్లో చాలా సిన్సియర్‌గా ఉంటున్నట్లు తల్లిదండ్రులు, భార్యల వద్ద నటిస్తుంటారు. బయటకు వచ్చిన తరువాత వారి పోకిరీ చేష్టలు చేస్తుంటారు. అలాంటి వారికి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తూ వారి మైండ్‌సెట్ మార్చేందుకు ప్రయత్నిస్తున్నాం. చాలా మంది మారుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో వారి చేష్టలను చూసి ఆ విషయాలను కొందరు తీవ్రంగా తీసుకునే ఘటనలు జరుగుతుంటాయి.

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయండి

వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్, జనవరి 30 : వచ్చే నెల 5న సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో పర్యటించనున్నారని, ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎస్పీ కోటిరెడ్డి, 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, రాహుల్‌శర్మలతో కలిసి కొడంగల్‌లో పర్యటించారు. కడా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఆర్డీవో కృష్ణన్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఐ రాములు, నందారం ప్రశాంత్ పాల్గొన్నారు.

కమిటీల రద్దుతో..

చెక్‌పవర్ చిక్కులు!

ఇటీవలే ప్రభుత్వ పాఠశాలలకు రూ.16 కోట్ల గ్రాంట్స్‌ను విడుదల చేసిన ప్రభుత్వం

మరో రెండు నెలల్లో ముగియనున్న ఆర్థిక సంవత్సరం

ఎస్ఎంసీ కమిటీల రద్దుతో నెలకొన్న చెక్ పవర్ సమస్య

'మన ఊరు- మన బడి'కి సంబంధించి మరో రూ.3.58 కోట్ల చెల్లింపులపైనా సంబిగ్ధత

రంగారెడ్డి, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఇటీవల రూ.16 కోట్ల గ్రాంట్స్ విడుదలయ్యాయి. ఈ నిధులను డ్రా చేయడంలో కీలకంగా ఉన్న పాఠశాల యాజమాన్య(ఎస్ఎంసీ)కమిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. కొత్త కమిటీలను ఇప్పట్లో ఏర్పాటు చేసే అవకాశం లేకపోవడంతో ఆయా పాఠశాలల అభివృద్ధి, మెయింటనెన్స్ నిర్వహణపై సందిగ్ధత నెలకొన్నది. 'మన ఊరు-మన బడి' కింద పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించి త్వరలోనే రూ.3.58 కోట్లు విడుదల కానున్నాయి. వీటిని కూడా ఎస్ఎంసీ కమిటీల ద్వారానే డ్రా చేయాల్సి ఉండడంతో గుత్తేదారులు సైతం ఆందోళన చెందుతున్నారు.

పాఠశాలల మెయింటనెన్స్‌పై సందిగ్ధత..

జిల్లాలో ఉన్న 881 ప్రాథమిక పాఠశాలలు, 181 ప్రాథమికోన్నత పాఠశాలలు, 248 ఉన్నత పాఠశాలల నిర్వహణకు సంబంధించి 2023-24 విద్యా సంవత్సరానికి గాను మొదటి విడుతలో ఇటీవలనే 50 శాతం నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని నిధులను విడుదల చేశారు. ఒక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 30 మంది ఉంటే ఏడాదికి రూ.11వేలు, 31-100 మధ్య ఉంటే రూ.25వేలు, 101-250 మంది ఉంటే రూ.50వేలు, 251-1,000 మందికి రూ.75వేలు, వెయ్యి మందికి పైగా ఉంటే రూ.లక్ష చొప్పున నిధులు విడుదలయ్యాయి. ఇలా.. అన్ని పాఠశాలలకు కలిపి స్పోర్ట్స్ నిధులు, స్కూల్ కాంప్లెక్స్‌లకు సంబంధించి రూ.16 కోట్లను ఆయా పాఠశాలల ఆకౌంట్లలో జమయ్యాయి. ఈ నిధులను ఆయా పాఠశాలల హెచ్ఎంలు స్కూల్ మెయింటనెన్స్‌తోపాటు, కంప్యూటర్ సర్వీసింగ్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, స్టేషనరీ, క్రీడా సామగ్రి కొనుగోలుకు వెచ్చించాల్సి ఉంటుంది. వీటికి వినియోగించే ప్రతి పైసాను పాఠశాల యాజమాన్య కమిటీ తీర్మానం చేయాల్సిందే. పాఠశాల హెచ్ఎం, ఎస్ఎంసీ చైర్మన్లకు జాయింట్ చెక్ పవర్‌ను కల్పించారు. వీరిద్దరి సంతకాలతోనే నిధులను డ్రా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఎస్ఎంసీ కమిటీలు రద్దు అయ్యాయి. ఈ నెల 29న కొత్త కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలనుకున్నప్పటికీ వివిధ కారణాలతో ప్రభుత్వం వాయిదా వేసింది. దీంతో నిధులను ఎలా డ్రా చేయాలన్న సందిగ్ధత నెలకొనడంతోపాటు పాఠశాలల మెయింటనెన్స్‌పైనా ఆందోళన వ్యక్తమవుతున్నది.

'మన ఊరు-మన బడి' గుత్తేదారుల్లో గుబులు..

రంగారెడ్డి జిల్లాలో 'మన ఊరు- మన బడి' కార్యక్రమంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు కొత్త రూపు తీసుకొచ్చింది. ఈ పథకం కింద జిల్లావ్యాప్తంగా 468 పాఠశాలలు ఎంపికకాగా.. 448 పాఠశాలలకు రూ.97.88 కోట్ల అంచనా వ్యయంతో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతులను ఇచ్చింది. ఇప్పటి వరకు 65 పాఠశాలల్లో పనులు పూర్తై పునః ప్రారంభమయ్యాయి. పలుచోట్ల పనులను పూర్తి చేసి చాలాకాలం అవుతున్నప్పటికీ సగం మేర మాత్రమే బిల్లులు చెల్లించారు. రూ.3.58 కోట్ల బకాయిలకు సంబంధించి అధికారులు ప్రభుత్వానికి నివేదించగా.. త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి. ఈ నిధులను కూడా ఎస్ఎంసీ కమిటీ ద్వారానే డ్రా చేయాల్సి ఉండడంతో గుత్తేదారులు ఆందోళన చెందుతున్నారు.

మార్చి 31తో ముగియనున్న ఆర్థిక సంవత్సరం..

మార్చి 31తో ఆర్థిక సంవత్సరం ముగియనుండగా.. ఇంకా రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్నది. మొదటి విడుతలో మంజూరైన 50 శాతం స్కూల్ గ్రాంట్స్ నిధులను ఖర్చు చేస్తేనే మిగతా 50 శాతం నిధులు విడుదల కానున్నాయి. దీంతో పాఠశాలల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితులనేప థ్యంలో ఎస్ఎంసీ చైర్మన్ స్థానంలో చెక్ పవర్ ఎవరికి ఇస్తారన్న దానిపై విద్యాశాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు తెలిసింది. ప్రభుత్వం త్వరగా నిర్ణయం వెల్లడిస్తే.. బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశం ఉన్నదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

హెల్మెట్ ధరించకుంటే

జరిమానే..

పట్నంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్న పోలీసులు

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 30 : హెల్మెట్ భారం కాదు.. భరోసా అనే శీర్షికతో ఈనెల 23న నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఇబ్రహీంపట్నం పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. హెల్మెట్ ధరించకుండా రోడ్లపై ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసే ప్రయాణికులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు, లా అండ్ ఆర్డర్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఎక్కడికక్కడ సుమారు 20 నుంచి 30 మంది హెల్మెట్ ధరించని వారిని పట్టుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తే జరిగే పరిణామాలు, పోలీసుశాఖ ఆధ్వర్యంలో తీసుకునే చర్యలపై అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం, యాచారం, తుర్కయంజాల్, ఆదిబట్ల, యాచారం పరిసర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ కళాశాలలు పెద్ద ఎత్తున ఉన్నందున విద్యార్థులు ఇష్టానుసారంగా ప్రయాణాలు కొనసాగిస్తూ గాయాలపాలవుతున్నందున దీనిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తున్నది. ముఖ్యంగా ట్రాఫిక్ పోలీసులు ఎక్కడికక్కడ జరిమానాలు విధిస్తున్నారు. హెల్మెట్ ధరించకుండా రోడ్లపైకి వచ్చే ద్విచక్ర వాహనదారులపై ఇకపై కఠినంగా వ్యవహరిస్తామని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ సీఐ గురునాయుడు తెలిపారు.

ఇబ్రహీంపట్నం సాగర్‌రహదారిపై బీడీఎల్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనదారులతో హెల్మెట్ పెట్టుకుంటామని ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసులు

వికారాబాద్ స్టేషన్‌లో నాలుగు రైళ్లకు

తాత్కాలిక స్టాప్

ఎస్‌సీఆర్ వెల్లడి

సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : వికారాబాద్ రైల్వే స్టేషన్‌లో నాలుగు రైళ్లకు తాత్కాలిక స్టాప్ ఏర్పాటు చేస్తూ మంగళవారం రైల్వే అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీటిలో ముంబయి-భువనేశ్వర్, రాజ్‌కోట్-సికింద్రాబాద్, భువనేశ్వర్-ముంబయి, సికింద్రాబాద్-రాజ్‌కోట్ వంటి రైళ్లకు తాత్కాలిక స్టాపు వర్తిస్తుందని సికింద్రాబాద్ రైల్వే అధికారులు తెలిపారు.

లక్ష్యం దిశగా..

ఎస్‌హెచ్‌జీలకు ప్రభుత్వం చేయూత

- **రంగారెడ్డి జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.710 కోట్లు, అందిన రుణాలు రూ.678 కోట్లు**
- **వికారాబాద్ జిల్లాలో రూ.463 కోట్లకుగాను రూ.405 కోట్ల రుణాలు మంజూరు**
- **ఉపాధితో ఆర్థిక అభ్యున్నతి సాధిస్తున్న జిల్లా మహిళలు**

వికారాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ): మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సంఘాల వారీగా కాకుండా వ్యక్తిగతంగానూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వడ్డీలేని రుణాలతోపాటు స్వల్ప కాలిక వడ్డీతో కూడిన రుణాలను మంజూరు చేస్తున్నారు. వాటితో స్వయం సహాయక సంఘాల సభ్యులు (ఎస్ హెచ్‌జీలు) కిరాణా షాపులు, వ్యవసాయం దాని అనుబంధ రంగాలు, పిండిగిర్నీలు, టైలరింగ్, బ్యూటీపార్లర్లు, పుట్‌వేర్ తదితర వ్యాపారాలు చేసుకుంటున్నారు. అయితే రంగారెడ్డి జిల్లాలో ఈ ఏడాదిలో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.710 కోట్ల రుణాలను ఎస్‌హెచ్‌జీలకు పంపిణీ చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకుని ఇప్పటివరకు రూ.678 కోట్ల (95.5 శాతం) రుణాలను.. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో రూ.463 కోట్లకుగాను రూ. 405కోట్ల (87.46 శాతం) రుణాలను మంజూరు చేశారు. రంగారెడ్డి జిల్లాలో జనవరి నాటికి 95.5 శాతం రుణ లక్ష్యాన్ని చేరుకోగా.. ఫిబ్రవరి 10తేదీ వరకు వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేస్తామని సంబంధిత శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాగా వికారాబాద్ జిల్లాలో ఫిబ్రవరి నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా రుణాలను మంజూరు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జిల్లాలో గతేడాది రూ.450 కోట్ల రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని లక్ష్యానికి మించి రూ.499 కోట్ల రుణాలను బ్యాంకర్లు స్వయం సహాయక సంఘాలకు అందించారు. జిల్లాలో 657 గ్రామసంఘాలు, 10,375 స్వయం సహాయక సంఘాలుండగా అందులో 1.80 లక్షల మంది సభ్యులున్నారు. రంగారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో 12,989 స్వయం సహాయక సంఘాలున్నాయి. రుణాల మంజూరులో జిల్లా రాష్ట్రంలో నాల్గో స్థానంలో ఉండగా.. రుణాల రికవరీలోనూ 1.06 ఎన్‌పీఏతో తెలంగాణలో 5వ స్థానంలో ఉన్నది. రుణాలను సకాలంలో చెల్లించే స్వయం సహాయక సంఘాలకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు అధిక ప్రాధాన్యమి స్తున్నారు. ఒక్కో స్వయం సహాయక సంఘానికి రూ.5 నుంచి రూ.10 లక్షల వరకు ఇస్తున్నారు. సంఘాల పనితీరును బట్టి సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరం రూ.20లక్షల వరకు మంజూరు చేస్తున్నారు.

రూ.405 కోట్ల రుణాలు మంజూరు..

వికారాబాద్ జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.463 కోట్ల లక్ష్యానికిగానూ ఇప్పటివరకు రూ. 405 కోట్ల (87.46%) రుణాలను ఎస్‌హెచ్‌జీలకు అందించారు. అత్యధికంగా బంట్వారం మండలంలో లక్ష్యానికి మించి 113% మేర రుణాలను మంజూరు చేయగా, మోమిన్‌పేట మండలంలో (33.39కోట్లు) 106%, కోట్‌పల్లి మండలంలో 105%, యాలాల మండలంలో (రూ.24.57 కోట్లు) 101%, పూడూరు మండలంలో 100.48%, కొడంగల్ మండలంలో 93.05%, నవాబుపేట మండలంలో(23.04 కోట్లు)92.92%, మర్పల్లి మండలంలో 89.44%, చౌడాపూర్ మండలంలో 88.81%, కులకచర్ల మండలంలో (22.85కోట్లు)85.56%, బషీరాబాద్ మండలంలో (రూ.24.84 కోట్లు)85.40%, దోమ మండలంలో (రూ.24.05 కోట్లు) 85.29%, పెద్దేముల్ మండలంలో 83.56%, పరిగి మండలంలో (20.75కోట్లు) 83.56%, ధారూరు మండలంలో 83.22%, వికారాబాద్ మండలంలో 82.46%, బొంరాస్‌పేట మండలంలో (19.29 కోట్లు)74% మేర బ్యాంకు లింకేజీ రుణాలను మంజూరు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేందుకు మరో రెండు నెలలు గడువున్న దృష్ట్యా అన్ని మండలాల్లోనూ లక్ష్యానికి మించి రుణాలను మంజూరు చేసేందుకు డీఆర్‌డీఏ అధికారులు చర్యలను ముమ్మరం చేశారు. అదేవిధంగా ఎన్‌పీఏ(పనిచేయని సంఘాలు) లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. రుణాలు తిరిగి చెల్లించడంలో మొండికేసిన సంఘాలకు రుణాలను నిలిపివేశారు. విలేజ్ ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మూడు వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు వ్యాపారులుగా మారారు. వారు వ్యాపారాలను నిర్వహించుకునేందుకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామసంఘం నిధుల ద్వారా సుమారు రూ.30 కోట్ల రుణాల వరకు అందజేశారు. ఇందులో ఒక్కో సభ్యురాలికి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు రుణాలను మంజూరు చేశారు.

ఫిబ్రవరిలోనే లక్ష్యాన్ని అధిగమిస్తాం

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యం పెరిగింది. ఏటా లక్ష్యాన్ని అధిగమించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నాం. ఈ ఏడాది ఫిబ్రవరి 10 నాటికే లక్ష్యాన్ని అధిగమిస్తాం. కలెక్టర్ ఆదేశాలు, సూచనలకు అనుగుణంగా మండలాల వారీగా సమీక్షలు నిర్వహించి అర్హులకు రుణాలు అందించి వారి ఆర్థిక పురోభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

– జంగారెడ్డి, ఏపీడీ, రంగారెడ్డి జిల్లా

- **గత ప్రభుత్వ హయాంలో గొల్ల, కుర్మలకు సబ్సిడీ గొర్రెలు పంపిణీ**
- **రంగారెడ్డి జిల్లాలో మొదటి విడుతలో 11.372 యూనిట్ల అందజేత**
- **రెండో విడుతకు డీడీలు కట్టి ఎదురు చూస్తున్న 790 మంది రైతులు**
- **పథకం కొనసాగింపుపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం**
- **ఆందోళనలో గొల్ల, కుర్మ లబ్ధిదారులు**

రెండో విడుత

అందేనా ?

షాబాద్, జనవరి 30 : తెలంగాణలోని గొల్ల, కుర్మల సంక్షేమానికి గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో అర్హులైన గొల్ల, కుర్మ లబ్ధిదారులందరికీ సబ్సిడీపై గొర్రెలు అందించేందుకు చర్యలు తీసుకున్నది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో గొల్ల, కుర్మలు ఎంతమంది ఉన్నారనే దానిపై సర్వేలు నిర్వహించింది. 2017లో 40వేలకుపైగా అర్హులను గుర్తించింది. మొదటి విడుతలో 11,372 మందికి గొర్రెల యూనిట్లు అందించింది. ఒక్కో యూనిట్‌లో 20 గొర్రెలు, ఒక పొట్టేలు చొప్పున 22 గొర్రెలను పంపిణీ చేసింది. ఆ తర్వాత రెండో విడుతలో మిగతా లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాటు చేస్తుండగా, కరోనా, పలు ఎన్నికల కారణంతో జాప్యమైంది. దీంతో మిగతావారికి ఇప్పటివరకు గొర్రెల యూనిట్లు అందలేదు. ఈ పథకం విలువ రూ.లక్షా75వేలు కాగా, లబ్ధిదారులు రూ.43,750 డీడీ రూపంలో చెల్లిస్తే మిగతా రూ.లక్షా 31,250 ప్రభుత్వం సబ్సిడీని కలిపి గొర్రెలను అందించింది. సబ్సిడీ గొర్రెలతో గొల్లకుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. తమను అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రవేశపెట్టిన ఈ పథకం ఎంతో బాగుందని, తమకు కూడా అందించాలని ప్రస్తుతం రెండో విడుతలో గొర్రెల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

డీడీలు కట్టిన 790 మంది రైతులు

రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా చేవెళ్ల, షాద్‌నగర్, ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు(కల్వకుర్తి),రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని 27 మండలాల్లో అర్హులైన గొల్ల, కుర్మలందరికీ సబ్సిడీ గొర్రెలు అందించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం గ్రామాలవారీగా లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఎంపిక చేసిన వారిలో 50 శాతం మందికి మొదటి విడుతలో, మరో 50 శాతం మందికి రెండో విడుతలో సబ్సిడీ గొర్రెలు అందించే దిశగా చర్యలు చేపట్టింది. మొదటి విడుతలో గొర్రెలు తీసుకున్న లబ్ధిదారులు వాటిని పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. మిగతావారికి రెండో విడుతలో గొర్రెలు అందించేందుకు గతేడాది ఆగస్టులో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నది. జిల్లావ్యాప్తంగా రెండో విడుతలో మొత్తం 30 వేల మందికి గొర్రెలు అందించాల్సి ఉండగా, ఆయా మండలాల పరిధిలో షెడ్యూల్ వారీగా గ్రామాలకు చెందిన రైతుల నుంచి డీడీలు తీసుకున్నది. రెండో విడుతలో తమకు కూడా గొర్రెలు వస్తాయని భావించిన మరో 2,132 మంది లబ్ధిదారులు రూ.43,750 చొప్పున డీడీలు కట్టారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 1,342 మందికి గొర్రెలను అందించింది. ఆ తర్వాత అనివార్య కారణాల వల్ల మిగతా 790 మందికి గొర్రెలు పంపిణీ చేయలేదు. వీరికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెలను అందిస్తుందా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇంకా గొర్రెల పథకానికి అర్హులైన 27వేలకు పైగా రైతులు డీడీలు కట్టలేదు. రెండో విడుతలో కట్టిన వారి డబ్బులు తిరిగి ఇస్తారా...? లేక గొర్రెలను అందిస్తారా అనే దానిపై స్పష్టత కరువైంది.

గొల్ల, కుర్మలు ఆర్థికంగా అభివృద్ధి

పేదల సంక్షేమమే ధ్యేయంగా గత పదేండ్ల పాటు అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచారు. గొల్ల, కుర్మలకు సబ్సిడీపై గొర్రెలు అందించి వారికి అండగా నిలిచారు. వాటిని పోషించుకుని గొల్ల, కుర్మలంతా ఆర్థికంగా అభివృద్ధి చెందారు.

గొర్రెలు పంపిణీ చేయాలి

ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించాలి. నాకు రెండో విడుతలో గొర్రెలు అందిస్తామని గత ప్రభుత్వంలో చెప్పారు. అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలు సంఘం సభ్యులకు అందజేశాం. మా ఊరి పేరు షెడ్యూల్‌లో రాకపోవడంతో గొర్రెలు ఇవ్వలేదు. ప్రభుత్వం స్పందించాలి.

– మ్యాగూడెం హన్మంతు, లబ్ధిదారుడు కుమ్మరిగూడ(షాబాద్)

అర్హులందరికీ గొర్రెలు అందించాలి

గొల్ల, కుర్మల సంక్షేమానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెలను పంపిణీ చేసింది. రెండో విడుత పంపిణీకి ఎన్నికల కోడ్ వచ్చింది. గతంలో మాదిరిగా సబ్సిడీ గొర్రెలను అందించాలి.

– కిష్టగోని సదానందం, గొర్రెల కాపరుల సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు..

జిల్లాలో మొదటి విడుతలో 11,372 మందికి సబ్సిడీపై గొర్రెలు పంపిణీ చేశాం. రెండో విడుత పంపిణీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. రెండో విడుతలో 30 వేల మందికి గొర్రెలు పంపిణీ చేయాల్సి ఉన్నది.

– డాక్టర్ అంజిలప్ప, రంగారెడ్డి జిల్లా పశుసంవర్ధకశాఖాధికారి